సాక్షి పెద్దపల్లి

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



డైనమిక్ లీడర్.. రాములు

రాజకీయాల్లో ఆయనది అలుపెరగని పోరాటం..మాస్, డైనమిక్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు పొందారు.. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు. - 8లో



జగ్జీవన్‌రాం ఆశయాలు సాధిద్దాం

బాబు జగ్జీవన్‌రాం లాంటి మహనుభావుడి ఆశయ సాధనలో భాగస్వాములం అవుదామని కలెక్టర్ సంగీత అన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.0/25.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఆహ్లాదకరంగా.. మధ్యాహ్నం విపరీతమైన ఎండవేడిమి ఉంటుంది.

ఇతరులతో నిన్ను నువ్వు పోల్చుకోవటం ఆపినప్పుడు నీవు నీ అసలైన జీవితపు ఆనందాన్ని పొందుతావు.
- మహ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
గురు	6:36	శుక్ర	4:40

రంజాన్ వేళలు

లెక్క తేలింది..!



ఇటీవల కురిసిన వానతో నష్టపోయిన పంట

- వడగండ్ల వర్షంతో 5,926 ఎకరాల్లో పంట నష్టం
- సకాలంలో సహాయం అందిస్తే మేలంటున్న రైతులు

సాక్షి, పెద్దపల్లి: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షంతో జిల్లాలో చేతికొచ్చే దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. రైతులు రెక్కల కష్టం నేలపాలు కావడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ప్రభుత్వం సైతం పంట నష్టం వివరాలు సేకరించేందుకు పలు మార్గదర్శకాలు జారీచేసింది. 33శాతానికి పైగా దెబ్బతిన్న వాటిని గుర్తించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో పంట నష్టం వివరాలు సేకరించారు. దీంతో జిల్లాలో 5,926 ఎకరాల్లో 4,530 మంది రైతుల పంటలు దెబ్బతిన్నట్లు లెక్క తేల్చారు. అయితే సర్కారు నిబంధనలతో చాలామంది రైతులకు పరిహారం అందకుండా పోయిందనే విమర్శలు అన్నదాతల నుంచి వినిపిస్తున్నాయి. అలాగే ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే రూ.10వేలతో పెద్దగా ప్రయోజనం ఉండదని, గతంలో నష్టపోయిన పంటలకే పరిహారం అందలేదని వాపోతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారైనా పంట నష్టం నివేదికలు బుట్టలో వేయకుండా వెంటనే సీఎం కేసీఆర్ ప్రకటించినట్లు పరిహారం తొందరగా విడుదల చేస్తే బాగుటుందని అన్నదాతలు వేడుకుంటున్నారు.

కానరాని బీమా పథకాలు

రైతులు వేసిన పంటలకు నష్టం జరిగినప్పుడు పరిహారం ఇచ్చి ఆదుకునేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకం (ఫసల్ బీమా యోజన), వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అమలు చేసేవి. ఈ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తుండగా.. మరికొంత రైతులు చెల్లించేవారు. ఈ పథకాలను ప్రభుత్వాలు ప్రవేశ పెట్టినప్పటికీ.. సరైన నిబంధనలు లేక, ప్రీమియం చెల్లించినప్పటికీ పంట నష్టం తర్వాత పరిహారం సకాలంలో రావటం లేదనే రైతులు బీమా చెల్లింపులపై అనాసక్తి చూపిస్తున్నారు. దీంతో అధికారులు ప్రతిపాదనలు పంపిస్తున్నా మూడేళ్లుగా దాదాపు రూ.13కోట్లు పరిహారం విడుదలకాక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఇన్సూరెన్స్ సంస్థల మీనమేషాలు..

పంటల బీమా పథకంలో భాగంగా పంట రుణం పొందిన రైతుల నుంచి బ్యాంకులు ప్రీమియం వసూలు చేసి ఇన్సూరెన్స్ సంస్థలకు చెల్లించేవి. కానీ.. పంట నష్టం జరిగినప్పటికీ రైతులకు పరిహారం చెల్లించడంలో ఇన్సూరెన్స్ సంస్థలు మీనమేషాలు లెక్కించాయి. దీనికితోడు పంట నష్టపోయిన రైతులను యూనిట్‌గా కాకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవడంతో ఏ ఒక్క రైతుకూ పరిహారం అందలేదు. దీనిలో లోపాలున్నాయంటూ ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రైతు అకాల వర్షాలతో నష్టపోయినా పరిహారం దక్కని పరిస్థితి నెలకొంది.

పంట నష్టం వివరాలు ఇలా..

మండలం	వరి	మొక్కజొన్న	ఉద్యాన పంటలు	నష్టం (ఎకరాల్లో)	రైతులు
ముత్తారం	49.16	13.07	14	76.23	103
జూలపల్లి	81.14	92.28	54.35	228.37	409
ఎలిగేడు	4,572.05	81.18	41.08	4,693.33	2,401
ధర్మారం	00	11.12	00	11.12	8
ఓదెల	00	862.14	52.39	915.13	1609
పెద్దపల్లి	00	2	0	2	2
మొత్తం	4,702.35	1,061.79	161.82	5,926.15	4,530

ప్రభుత్వ నిబంధనల మేరకు



ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేశాం. జిల్లాలో వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు కలిపి 1609 మంది రైతులకు చెందిన 915.13 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించాం. వీరందరికి త్వరలో ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం అందించనుంది.

– ఆదిరెడ్డి, డీఏవో

త్వరగా అందిస్తే మేలు



నాకున్న భూమిలో మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరానికి రూ.35వేల చొప్పున సుమారు రూ.లక్ష పైనే పెట్టుబడి పెట్టిన చెడగొట్టు వడగండ్ల వానతో పంటంతా నేలవారి చేతికి రాకుండా పోయింది. సీఎం కేసీఆర్ ఇస్తానన్న పరిహారం సకాలంలో అందిస్తే కొంత న్యాయం జరుగుతుంది.

– కాంటాల వీరన్న, ఆరేపల్లి, కాల్వశ్రీరాంపూర్

న్యూస్‌రీల్

జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, ఉత్సవాల కమిటీ కో–ఆర్డినేటర్ మైస రాజేశ్, సింగరేణి ఏరియా ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌రాజ్, నాయకులు మిర్యాల రాజిరెడ్డి, గౌరై రమేష్, మాదాసు రాంమూర్తి, వంగ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


ధరణితో రైతుల ఇబ్బందులు



పెద్దబొంకూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బంది పడుతున్నారని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ కాంగ్రెస్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కారంగాక ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, ఉన్న పంటను కాపాడుకుందామంటే త్రీఫేస్ విద్యుత్ ఉండడం లేదని పేర్కొన్నారు. రుణమాఫీ అమలుకాకపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు సి.సత్యనారాయణ రెడ్డి, వేముల రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు కదార్ల శ్రీనివాస్, సయ్యద్ మస్రత్, ఆరె సంతోష్, మిట్టపల్లి కనకయ్య, మిట్టపెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ల పాలన సాగిస్తున్న కేసీఆర్



రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడితే మేలు జరుగుతుందని ఆశపడిన ప్రజానీకానికి నాటి నిజాం నిరంకుశ పాలనను గుర్తుకు తెచ్చేలా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు కరీంనగర్‌లో అరెస్ట్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లాకేంద్రంలోని కమాన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బండిని రాష్ట్ర పోలీసులు సినీ ఫక్కీలో అరెస్ట్ చేసి వాహనాల్లో మారుస్తూ తీసుకెళ్లడమేంటని ప్రశ్నించారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, చిలారపు పర్వతాలు, సంపత్‌రావు, రాజం మహంతకృష్ణ, ఎర్రోళ్ల శ్రీకాంత్, సిలివేరు మధు, ప్రభాకర్ తదితరులున్నారు.

నిరుద్యోగులతో చెలగాటమా..

సుల్తానాబాద్: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రూప్–1తో పాటు పోటీ పరీక్షల పేపర్లు లీక్ అవ్వడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. నిరుద్యోగ యువతతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూషణవేణి రమేశ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి ఎస్పీ.రాజయ్య గౌడ్, నాయకులు పెర్క సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీఆంజనేయం

- కాషాయమయమైన కొండగట్టు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధి కాషాయమయమైంది. లక్షలాదిగా తరలివచ్చిన దీక్షాస్వాములు, మాలధారులు, సాధారణ భక్తులతో పుణ్యక్షేత్రం రద్దీగా మారింది. 'జై శ్రీరామ్.. జై హనుమాన్' అంటూ భక్తుల నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. బుధవారం ఉదయం ఐదు గంటల నుంచే మనరాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడం ప్రారంభమైంది. వీరంతా బుధవారం అర్ధరాత్రి 12గంటల తర్వాత క్యూలైన్ల ద్వారా శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత కల్యాణ కట్టకు చేరుకుని మాల విరమణ, దీక్ష విరమణ చేశారు. గురువారం హనుమాన్ చిన్నజయంతి నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పోలీసుల డేగకళ్లతో పహారా కాస్తున్నారు.









జైలు వద్ద కోలాహలం



జైలు వద్ద పోలీసుల బందోబస్తు



బండిని కలవడానికి వచ్చిన కుటుంబ సభ్యులు

కరీంనగర్‌క్రైం: ఎస్సెస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బీజేపీ స్టేట్ చీఫ్ సంజయ్‌కు హన్మకొండ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా.. బుధవారం రాత్రి కరీంనగర్ జైలుకు తరలించారు. రాత్రి 10 గంటలకు సంజయ్‌ను జైలుకు తీసుకురాగా.. ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యులు, అభిమానులు ప్రయత్నించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకుని జైలు బయటి గేటు దాటకుండా నిలువరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ మళ్లించి జైలు రోడ్లను దిగ్బంధం చేశారు.

హుజూరాబాద్‌లో కార్యకర్తల అరెస్ట్

బండి సంజయ్‌ని వరంగల్ నుంచి కరీంనగర్ వైపు కాన్వాయ్‌లో తీసుకొస్తున్న క్రమంలో హుజూరాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంజయ్ అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేశారు. మానకొండూరులో బీజేపీ నాయకులు భాషబోయిన ప్రదీప్ యాదవ్, కోంద్ర సురేశ్, మార్కొండ రమేశ్, నందగిరి బలరాం పోలీసుల కాన్వాయిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

కరీంనగర్ టు కరీంనగర్..

మంగళవారం రాత్రి హైడ్రామా మధ్య సంజయ్‌ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి వివిధ పోలీసు స్టేషన్లు తిప్పారు. బుధవారం సాయంత్రం హన్మకొండ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా, రిమాండ్ మేరకు బుధవారం రాత్రి తిరిగి కరీంనగర్ జైలుకు తరలించారు. 24 గంటలు గడవకముందే కరీంనగర్‌లోనే అరెస్ట్ చేసి కరీంనగర్ జైలులోనే రిమాండ్ చేశారు.

ఎస్సెస్సీ.. టీఎస్‌పీఎస్సీ.. లీకు మూలాలు ఇక్కడే!

- ఉమ్మడి జిల్లాకు పేపర్ల లీకుల లింకులు
- పదో తరగతి పేపర్ కేసులో ఏ–1గా సంజయ్
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటలకూ చేరిన పోస్టు
- ఆ ఘటనలోనే బండిపై సుమోటో కేసు, ప్రీవెంటివ్ అరెస్టు
- అరెస్టు సమయంలో మరోసారి కరీంనగర్‌లో హైడ్రామా
- మల్యాలలో టీఎస్‌పీఎస్సీ లీకేజీపై సిట్ విచారణ



మంగళవారం రాత్రి బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అరెస్టు అనంతరం రాష్ట్ర రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంగళవారం పదో తరగతి హిందీ పరీక్ష పత్రం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో పోలీసులు అత్యంత గోప్యంగా, పకడ్బందీగా వ్యవహరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంగళవారం రెండు పరిణామాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఉదయం ఎస్సెస్సీ పేపర్ బూర ప్రశాంత్ అనే యువకుడి కారణంగా కమలాపూర్ నుంచి బయటికి రావడంతో పరిణామాలు అకస్మాత్తుగా మారిపోయి, రాత్రి వరకు బండి సంజయ్ అరెస్టుకు దారి తీసింది. మరోవైపు ఇటీవల టీఎస్ పీఎస్సీ లీకేజీలో ఏ–2 నిందితుడిగా ఉన్న అట్ల రాజశేఖర్‌రెడ్డి జగిత్యాల జిల్లా మల్యాలకు చెందిన అతను కావడంతో సిట్ దర్యాప్తులో భాగంగా దర్యాప్తు ముమ్మరం చేసింది. దీంతో రాష్ట్రాన్ని తీవ్రంగా కుదిపేసిన రెండు అంశాలకు మూలం ఉమ్మడి కరీంనగర్ జిల్లానే కావడం చర్చనీయాంశంగా మారింది.

సంజయ్, ఈటలకు లింకులు..?

మంగళవారం ఉదయం ఎస్సెస్సీ పేపర్ సోషల్ మీడియాలో బయటికి రావడం కలకలం రేపింది. ఈ విషయంలో పోలీసులు పేపర్ ఎక్కడి నుంచి వచ్చింది? అన్న విషయాన్ని గుర్తించినా.. దానికి బండి సంజయ్‌కు ఉన్న లింకులను బుధవారం వెల్లడించింది. పేపర్‌ను బూర ప్రశాంత్ తొలుత ఎంపీ బండి సంజయ్‌కు పంపడం, పలుమార్లు ఫోన్లు మాట్లాడటంతో అతడినే ఈ కేసులో కుట్రదారుడిగా.. ఏ–1గా వరంగల్ పోలీసులు చేర్చారు. అదే సమయంలో సదరు ఎస్సెస్సీ హిందీ పేపర్ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫోన్‌కు కూడా చేరిందని పోలీసులు తెలిపారు. కానీ.. ఈ ఆరోపణలను రాజేందర్ మీడియాకు స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోయారు. ఇదే కమలాపూర్ పోలీసులు బండి సంజయ్ మీద నమోదు చేసిన కేసు ఆధారంగా కరీంనగర్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. బుధవారం మధ్యాహ్నానికి బండి సంజయ్‌పై టూటౌన్‌లో సుమోటో కేసు నమోదు చేసి, ముందస్తు అరెస్టుకు దారి తీసిన పరిస్థితులను ఎఫ్ఐఆర్‌లో వివరించారు.

మల్యాలలో సిట్.. దూకుడు..!

మరోవైపు టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 పేపర్ లీకేజీలో ఏ–2గా ఉన్న రాజశేఖర్‌రెడ్డిది జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి. 2017 వరకు విదేశాల్లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి తరువాత ఏడాది తనకున్న పరిచయాలతో టీఎస్‌పీఎస్సీలో కొలువు సాధించాడు. అనంతరం పలు పేపర్లను పరీక్షకు ముందే విక్రయించాడన్న కేసులో అరెస్టయ్యాడు. ఇతను కూడా ఉమ్మడి జిల్లా వాసి కావడం గమనార్హం. మండలంలో మొత్తం 40 మంది గ్రూప్–1 పరీక్ష రాసిన వారి వివరాల ఆధారంగా సిట్ నేరుగా మంగళవారం నుంచి రంగంలోకి దిగింది. మొత్తం 40 మందిలో దాదాపు 35 మందికిపైగా 100 లోపు మార్కులు రాగా, కేవలం ఐదుగురికి మాత్రం 100 మార్కులు దాటాయని సమాచారం. వీరందరినీ సిట్ బృందం రెండురోజులుగా నేరుగా వారి ఇంటికే వెళ్లి విచారిస్తోంది.

మరోసారి కరీంనగర్‌లో ఉద్రిక్తత..!

ఎస్సెస్సీ హిందీ పేపర్ సోషల్‌మీడియాలో ప్రత్యక్షం కావడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సాయంత్రానికి కుట్రలో ఎవరెవరు పాలు పంచుకున్నారన్న విషయంపై పోలీసు శాఖ పలు ఆధారాలు సంపాదించింది. అందులో భాగంగానే మంగళవారం అర్ధరాత్రి బండి సంజయ్‌ను జ్యోతినగర్‌లోని అతని స్వగృహం నుంచి బలవంతంగా అరెస్టు చేసి బొమ్మల రామారం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

- గతేడాది జనవరి 2వ తేదీన 317 జీవో అమలుకు వ్యతిరేకంగా జరిగిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆ క్రమంలో పోలీసులు బీజేపీ కార్యాలయం తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేసిన విషయం సంచలనం రేపింది. తరువాత ఈ విషయంలో పోలీసుల తీరుపై పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి బండి ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది.
- ఆ తరువాత నవంబరు 27న భైంసా సభకు అనుమతి లేదంటూ జగిత్యాల సమీపంలో అరెస్టు చేసిన పోలీసులు అదే రోజు రాత్రి ఆయన్ని కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లోని ఆయన నివాసంలో దింపి వెళ్లిపోయారు.
- తాజాగా మరోసారి బండి సంజయ్‌ను అరెస్టు చేస్తున్న క్రమంలోనూ బుధవారం తెల్లవారుజామున తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బండిని అరెస్టు చేయకుండా అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించడంతో భారీ తోపులాట జరిగింది. మొత్తానికి బండి సంజయ్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిన ప్రతీసారి కరీంనగర్‌లో అర్ధరాత్రి హైడ్రామా నెలకొంటోంది.

డైనమిక్ లీడర్.. రామ్‌లు

- జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిత్వం
- అనారోగ్యంతో కన్నుమూసిన 'కొమిరెడ్డి'
- శోకసంద్రంలో అభిమానులు
- పలువురు నాయకుల సంతాపం
- మెట్‌పల్లిలో రేపు అంత్యక్రియలు


మెట్‌పల్లి నగరబాటలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో కొమొరెడ్డి రామ్‌లు (ఫైల్)

కోరుట్ల/మెట్‌పల్లి: రాజకీయాల్లో ఆయనది అలుపెరగని పోరాటం.. నమ్మిన సిద్ధాంతం కోసం రాజీపడని మనస్తత్వం.. మాస్, డైనమిక్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు(82).. జిల్లా రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిగా పేరు సంపాదించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. బుధవారం హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న ఆయన.. రెండేళ్ల క్రితం కరోనా బారిన పడ్డారు. ఆ తర్వాత కోలుకున్నా.. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. అప్పటినుంచి తరచూ ఆస్పత్రుల్లో వైద్యచికిత్సలు తీసుకుంటున్నారు. కొద్దిరోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న గుండెపోటుకు గురై తనువు చాలించారు. ఆయన మరణంతో నియోజకవర్గంలో విషాదఛాయలు అలముకున్నాయి. అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. పార్థివ దేహాన్ని మెట్‌పల్లిలోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య జ్యోతిదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభం

- మెట్‌పల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన రామ్‌లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయవిద్య పట్టా పొందారు.
- ఓవైపు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే మరో వైపు రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించారు.
- 1968లో వెంకట్రావ్‌పేట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.
- 1978లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.
- 1983లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచి రెండోస్థానంలో నిలిచారు.
- 1985 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి చెన్నమనేని విద్యాసాగర్‌రావు చేతిలో కేవలం 372 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు.
- 1989, 94, 99 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు.
- 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ లభించకపోవడంతో జనతా పార్టీ నుంచి బరిలో నిలిచారు.
- ఆ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుపై విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు.
- ఆ సమయంలో ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరించారు.
- 2009లో పోటీకి దూరంగా ఉన్న ఆయన.. 2014లో మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2018లో పోటీకి దూరంగా ఉన్నారు.
- మొత్తానికి ఎన్నికల్లో అనేకమార్లు పరాజయం చవిచూసినా.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ కొమొరెడ్డి రామ్‌లు ఆదర్శంగా నిలిచారు.

పేరులో మార్పుతోనే ఎమ్మెల్యేగా విజయం..

కొమిరెడ్డి రాములుగా ఎన్నికల్లో పోటీచేసిన ప్రతీసారి ఆయన పరాజయమే చవి చూశారు. 2004 ఎన్నికలకు ముందు ఆధ్యాత్మికవేత్తల సూచనల మేరకు తన పేరులో మార్పు చేసుకున్నారు. కొమిరెడ్డిగా ఉన్న ఇంటి పేరును కొమొరెడ్డిగా, రాములు పేరును రామ్‌లుగా మార్చుకున్నారు. ఇలా మార్చుకొని ఆ తర్వాత ఎన్నికల్లో పోటీచేసిన ఆయన విజయం సాధించారు. అది కలిసి రావడంతో అప్పటి నుంచి 'కొమొరెడ్డి రామ్‌లు'గానే కొనసాగుతూ వస్తున్నారు.

సతీమణి జ్యోతికి రాజకీయంగా ప్రోత్సాహం

- కుటుంబంలో రాజకీయంగా తన సతీమణి జ్యోతిదేవిని కూడా రామ్‌లు ప్రోత్సహించారు.
- న్యాయ విద్య అభ్యసించిన జ్యోతిని 1998లో మెట్‌పల్లికి జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిపారు.
- ఆ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు.
- అంతకుముందు జ్యోతి మెట్‌పల్లి ఎంపీపీగా వ్యవహరించారు.
- రామ్‌లు–జ్యోతి దంపతులకు ముగ్గురు కుమారులు.
- తమలాగే వీరిని న్యాయవాదులుగా తీర్చిదిద్దారు.
- పెద్ద కుమారుడు కరంచంద్‌ను తమ రాజకీయ వారసునిగా వచ్చే ఎన్నికల్లో పోటీలో నిలపాలని నిర్ణయించారు.

ప్రత్యర్థులకు హడల్

రాజకీయాల్లో విమర్శలు సహజం. ఒక పార్టీవారిని మరోపార్టీ వారు విమర్శించడం సాధారణం. కానీ, కోరుట్ల నియోజకవర్గంలో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉండడం గమనార్హం. రామ్‌లును విమర్శించడానికి ప్రత్యర్థి పార్టీల నాయకులు ఎవరు కూడా సాహసించకపోవడం ఆయన విలక్షణమైన వ్యక్తిత్వానికి నిదర్శనమనే అభిప్రాయం ఉంది.

రాజీపడని మనస్తత్వంతో నష్టాలు..

నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన ఏనాడూ రాజీపడలేదు. దీంతో రాజకీయంగా చాలా నష్టపోయారనే అభిప్రాయం ఉంది. బీసీ నాయకుడిగా ఆదినుంచీ దొరల పాలనను వ్యతిరేకించే వారు. ఈ నేపథ్యంలో రాజకీయంగా అనేక ఆటుపోట్లు ఎదురైనా వెనుకంజ వేయలేదు. ఇదే ఆయనకు ప్రజల్లో ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది.

పలువురి సంతాపం

రామ్‌లు మృతికి మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మత్స్య కార్మికుల హక్కులు అమలు చేయాలి


రమాదేవిని సన్మానిస్తున్న సమితి సభ్యులు

పెద్దపల్లి రూరల్: ప్రభుత్వం మత్స్య కార్మికుల హక్కులను అమలు చేయాలని ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లిలోని ఓ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య కార్మికుల హక్కుల సాధనకై నాలుగు ఎజెండాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బండి రమాదేవి నియమించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు కారుపాకల సరోజ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు స్వప్న, రాజేశం, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలి మృతి


సదయ్య మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని మడక గ్రామానికి చెందిన మ్యాకల సదయ్య (40) అనే వ్యవసాయ కూలి గుండె పోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సదయ్య రోజూ మాదిరిగానే బుధవారం కూలి పనులు ముగించుకొని గ్రామంలోని బస్టాండు సమీపంలో కూర్చున్నాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. గ్రామస్తులు గమనించి, 108కు సమాచారం అందించారు. అనంతరం అతనికి సీపీఆర్ చేస్తుండగా అంబులెన్స్ వచ్చింది. సిబ్బంది పరీక్షించి, సదయ్య మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య వజ్ర, నలుగురు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓబీ తొలగింపుపై వీడియో కాన్ఫరెన్స్


వీసీలో పాల్గొన్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీల్లో ఓబీ తొలగింపుపై సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డిలు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో అన్ని ఏరియాల జీఎంలు పాల్గొనగా ఆర్జీ–2 ఏరియా నుంచి ఎ.మనోహర్ హాజరై, రాబోయే ఆర్థిక సంవత్సరంలో వెలికితీయాల్సిన ఓబీపై వివరించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని, ఏరియాకు కేటాయించిన 21.60 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రాం ఆశయసాధనకు పాటుపడదాం

- అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు
- కలెక్టర్ సంగీత వెల్లడి
- జిల్లా కేంద్రంలో బాబుజగ్జీవన్‌రాం జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో.. రాజకీయ, సామాజిక రంగాల్లోనూ బాబు జగ్జీవన్‌రాం ప్రత్యేక గుర్తింపు పొందారని, అలాంటి మహానుభావుడి ఆశయ సాధనలో భాగస్వాములం అవుదామని కలెక్టర్ సంగీత అన్నారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ వద్ద గల జగ్జీవన్‌రాం విగ్రహానికి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, టీఎన్‌జీఓల సంఘం అధ్యక్షుడు బొంకూరి శంకర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కొందరు మహనీయులను ఓ వర్గం వారేనన్న అపోహలో ఉన్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. పూలే, అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు తరలిరావాలన్నారు. బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవాన్ని ప్రోత్సహించారని అడిషనల్ కలెక్టర్ అన్నారు. జగ్జీవన్‌రాం స్ఫూర్తితో సమాజహితానికి పాటుపడుతూ మంచిపేరు సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటమాధవరావు, రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగలేశ్వర్, ప్రజాసంఘాలు, పలు సంస్థలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అట్టడుగువర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రాం కృషి

మంథని: అక్షర జ్ఞానంతోనే అట్టడుగువర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆలోచించి ఆ దిశగా కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రాం అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. జగ్జీవన్‌రాం జయంతిని మంథనిలో బుధవారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రాకేష్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ఉన్నారు.

పుస్తెలతాడు చోరీ

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌కు చెందిన కొటం లక్ష్మి అనే వృద్ధురాలి మెడలోని మూడు తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన దొంగలు తనపై దాడి చేసి, పుస్తెల తాడు ఎత్తుకెళ్లారని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రెండో సీఐ ప్రసాదరావు తెలిపారు.

సుందిళ్లలో పనులు పరిశీలించిన ఆర్జీ–1 జీఎం


పనులు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామగిరి మండలంలోని సుందిళ్లలో అభివృద్ధి పనులను కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజలింగుతో కలిసి పరిశీలించారు. సుందిళ్ల ప్రధాన రహదారి వెంట విద్యుత్ దీపాల ఏర్పాటు, దారి మైసమ్మ గుడి నిర్మాణం, గ్రామ ప్రజలకు తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, ఎస్టేట్ అధికారి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం



పెద్దపల్లిరూరల్: ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ముందుగా సీఎం కేసీఆర్ మనసు మారాలని శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

ఒక్క ఎస్ఎంఎస్‌తో రూ.1.50 లక్షలు మాయం

జ్యోతినగర్(రామగుండం): మొబైల్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ లింక్‌తో ఓ వ్యక్తి ఖాతాలో నుంచి రూ.1.50 లక్షలు మాయమైన సంఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై బి.జీవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌నకు చెందిన విష్ణుదేవరావు మొబైల్‌కు పాన్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఎస్ఎంఎస్ వచ్చింది. దీంతో ఆయన సదరు లింక్ ఓపెన్ చేసి, వివరాలు అప్‌లోడ్ చేయడంతో బ్యాంకు ఖాతాలోని రూ.1.50 లక్షలు డెబిట్ అయినట్లు మెస్సేజ్ వచ్చింది. తాను మోసపోయానని తెలుసుకున్న బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో సింగరేణికి నష్టం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వ తీరుతో సింగరేణికి తీరని నష్టం జరుగుతోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే తమ యూనియన్‌ను ఆదరించాలని కోరారు. నాయకులు ఆకుల హరిణ్, మాదాసు రవీందర్, ఎల్లావుల కోటయ్య, పెంచాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే ప్రశ్నపత్రం లీక్'

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పదోతరగతి ప్రశ్నపత్నం లీక్ చేయించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన సంజయ్‌ని బీజేపీ అధ్యక్ష పదవి నుండి తొలగించడమే కాకుండా ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ముత్యం రమేశ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, రైతు సంఘం మండల అధ్యక్షుడు బోయిని రాయమల్లు, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు తదితరులున్నారు. రాస్తారోకో చేస్తున్న సమాచారం అందుకున్న సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఎస్సైతో అశోక్ రెడ్డితో కలిసి అక్కడికి వెళ్లారు. వారితో మాట్లాడి, పంపించారు. రాస్తారోకో చేస్తున్న సమయంలో పట్టణంలోని పూసాల గ్రామానికి చెందిన నరేందర్‌ను కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆయనను నాయకులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఎలిగేడు(పెద్దపల్లి): రాష్ట్రంలో పదోవతరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తన అనుచరులతో పేపర్ లీక్ చేయించి, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆయనను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఎలిగేడు మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో రాస్తారోకో చేపట్టారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదుర్గయ్య, నాయకులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ రైలు.. ఐదు గంటలు ఆలస్యం

- రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల ఇబ్బందులు
- మూడో రైల్వే లైను, రైలు పట్టాల మరమ్మతు కారణమన్న సిబ్బంది

ఓదెల(పెద్దపల్లి): సిర్‌పూర్ కాగజ్‌నగర్–సికింద్రాబాద్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం ఐదు గంటలు ఆలస్యంగా నడవటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 5:24 గంటలకు కొలనూర్ రావాల్సిన రైలు 10 గంటలకు వచ్చింది. దీంతో మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, జమ్మికుంట రైల్వేస్టేషన్ల నుంచి సికింద్రాబాద్, కాజీపేట్, వరంగల్ వెళ్లాల్సిన ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. ఏం చేయాలో తెలియక విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళన చెందారు. మూడో రైల్వేలైను, రైలు పట్టాల మరమ్మతు కారణాంగానే రైలు ఆలస్యంగా నడిచిందని రైల్వే శాఖ సిబ్బంది ద్వారా తెలిసింది. ఇలా అయితే ఎండ తీవ్రతకు వృద్ధులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలన పాటించి, రైలు నడిపించాలని కోరారు.

సమయానికి నడిపించాలి



భాగ్యనగర్ రైలును సమయానికి నడిపించాలి. ఆలస్యంగా రావడంతో ఉద్యోగులు, విద్యార్థులు నరకయాతన పడ్డారు. రైల్వేస్టేషన్‌లో అరకొర సౌకర్యాలు, గంటల తరబడి రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు సతమతమవుతున్నారు.
– కర్ర శివారెడ్డి, ప్రయాణికుడు, ఓదెల

ఇబ్బంది పడ్డాం



రైలు పొద్దుగాల పోవాల్సి ఉండగా ఐదు గంటలు లేటైంది. ఎండలోనే ఉండిపోయినం. తెల్లారేసరికి పోవాల్సిన రైలు ఎండకు రావడంతో పిల్లలు, పెద్దలు నీటి సౌలత్ లేక ఇబ్బంది పడ్డాం. రైలును టైంకు పంపియ్యాలె.
– బోయిని కొంరయ్య, ప్రయాణికుడు, కొలనూర్

కోర్టు కేసు పరిష్కారానికి చొరవ తీసుకోవాలి


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి కోర్టు కేసు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్రీనివాస్, పల్లెపాటి వేణుగోపాల్‌రావులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాధారణ బదిలీలు, పదోన్నతులతోపాటే ప్రాథమిక పాఠశాలల హెడ్ మాస్టర్ పోస్టులను కూడా ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. టీచర్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, వేసవి సెలవుల్లో చేపట్టేలా కోర్టు కేసు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, పీఆర్‌టీయూ తెలంగాణ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్, నాయకులు తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మహేందర్ (ఫైల్)

రామడుగు(చొప్పదండి): మండలంలోని దత్తోజీపల్లికి చెందిన తొట్ల మహేందర్(36) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మహేందర్ గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. బుధవారం ఉదయం గోడలకు నీళ్లు పట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి, నీటి సంపులో పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని స్థానికులు పేర్కొన్నారు. మహేందర్ భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న యాకయ్య

జ్యోతినగర్(రామగుండం): నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణానికి పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని సర్కారు భూమిలో పార్టీ జెండాలను పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం భూ పోరాటాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడంతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. 2007లో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీలో ప్లాట్లు ఇవ్వగా 15 ఎకరాల భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేదలకు చెందాల్సిన భూమి దళారుల పాలవుతోందన్నారు. 617 సర్వే నంబర్‌లో గల సర్కారు భూమిని గుర్తించి, హద్దులు నిర్ణయించి, అర్హులైన పేదలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల కుమారస్వామి, భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, రామాచారి, భాగ్య, శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబాటు

- శాత్రాజ్‌పల్లి అభివృద్ధికి సహకరిస్తా
- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు


గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మధు

రామగిరి(మంథని): గత పాలకుల నిర్లక్ష్యంతోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబాటుకు గురైందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దులోని మానేరుకు అవతలి వైపు ఉన్న ముత్తారం మండలం పారుపెల్లి పంచాయతీ పరిధి శాత్రాజ్‌పల్లిని బుధవారం ఆయన సందర్శించారు. స్థానిక పరిస్థితులు తెలుసుకున్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే తపన ఉన్నా తాను ఎమ్మెల్యేగా పని చేసిన నాలుగేళ్ల సమయం సరిపోలేదన్నారు. శాత్రాజుపల్లికి సరైన రహదారి సౌకర్యం లేదని, మంథని నియోజకవర్గం 150 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. గ్రామ సమస్యలను గ్రామస్తులు ఏనాడూ తన దృష్టికి తీసుకురాలేక పోయారని పేర్కొన్నారు. నాయకులను నిలదీస్తేనే అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. స్థానిక నాయకులు ఇక్కడి పరిస్థితిని తనకు చెప్పడంతో వెంటనే గ్రామానికి వచ్చానన్నారు. రాబోయే రోజుల్లో శాత్రాజుపల్లి అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముంజం దేవేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న మేకల చిరంజీవిని పరామర్శించి, భరోసా కల్పించారు. ఆయన వెంట ఎంపీపీ జక్కుల ముత్తయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ఇల్లెందుల అశోక్, ఒడ్నాల రాజు, అడవిశ్రీరాంపూర్ సర్పంచ్ తుంగాని సమ్మయ్య, మాజీ సర్పంచ్ చెల్కల అశోక్, నాయకులు పూదరి మహేందర్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

'దళిత సర్పంచ్‌ననే సమాచారం ఇస్తలేరు'

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో చిన్నబొంకూర్ సర్పంచ్ ఆవేదన


ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు, కార్యకర్తలు

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): తాను దళిత సర్పంచ్‌ని అయినందువల్లే వివక్ష చూపుతూ బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని చిన్నబొంకూర్ సర్పంచ్ ఆర్నకొండ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. దళితుల పట్ల ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పార్టీ మండల నాయకులు వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తన గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని పలుమార్లు ఎమ్మెల్యేను అడిగానని తెలిపారు. అయినా కేటాయించలేదన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ద్వారా రూ.70 లక్షలు మంజూరు చేయించుకున్నప్పటి నుంచి ఎమ్మెల్యే తనపై వివక్ష చూపిస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో అసమ్మతి మొదలవడంతో మంత్రి కేటీఆర్ ప్రతీ గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని సూచించారని పలువురు సీనియర్ నాయకులు తెలిపారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులపై చూపిస్తున్న వివక్షతో పార్టీకి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.